క్లుప్తంగా

వెంకన్నకు అభిషేకాలు



వేంకటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జువ్వలపాలెం రోడ్డులో ఉన్న శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఉదయం ధనుర్మాసం నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి, అమ్మవారికి వేద పండితులు అభిషేకం, లక్ష తులసిపూజ, లక్ష కుంకుమార్చన, శాంతికల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాసాంజనేయునికి పుష్పార్చన



ప్రత్యేక అలంకరణలో దాసాంజనేయస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మారుతీ టాకీస్ సెంటర్‌లో ఉన్న శ్రీదాసాంజనేయ స్వామి వారి 43వ హనుమద్ వ్రత వార్షికోత్సవాల్లో భాగంగా 108 కలశాల సుగంధ ద్రవ్యాలతో, పంచామృతములతో అభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం పుష్పార్చన నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దీపాలతో భవానీ మాలధారుల ప్రదర్శన



ఆకివీడులో దీపాలతో భవానీ దీక్షాధారులు

ఆకివీడు: కనకదుర్గమ్మ మాల ధరించిన భవానీలు బుధవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో ప్రమిదలతో దీపాలు వెలిగించి ప్రదర్శన నిర్వహించారు. భవానీ మాలాధారులంతా ప్రదర్శనలో పాల్గొని జై భవానీ అంటూ నినాదాలు చేశారు. మాలాదీక్ష విరమణ ముందు అమ్మవారిని గ్రామోత్సవంగా దీపాలతో ఊరిగించడం ఆనవాయితీ అని భవానీ మాలధారులు చెప్పారు.

నేడు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ పీజీ, డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు బుధవారం కళాశాల చైర్మన్ కేవీ నరసింహరావు విలేకరులకు తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో ఎన్ఐఐటీ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, ఫోన్ పే వంటి మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంవారైనా ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు వచ్చే అభ్యర్థులు వారి అకాడమిక్ సర్టిఫికెట్స్ జిరాక్స్, రెండు ఫొటోలు, బయోడేటా తీసుకురావాలన్నారు. అభ్యర్థులు ఇంటర్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీఈ, బీటెక్, ఎంబీఏల్లో అర్హతలు కలిగి 2019 నుంచి 2023 లోపు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ డ్రైవ్‌లో పాల్గొనే అభ్యర్థులు గురువారం ఉదయం 9.30 గంటలకు కళాశాల ప్రాంగణంలో తమ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలు కోసం ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు 97013 94660కు ఫోన్ చేయాలని సూచించారు.

సీఎం జగన్‌కి అండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లోని పేదలు సిద్ధంగా ఉన్నారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు స్పష్టం చేశారు. పాలకొల్లులో మాలమహానాడు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ 175 కి 175 స్థానాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నచోట అభ్యర్థులను మారుస్తున్నారని, అయితే వైఎస్సార్ సీపీ పని అయిపోయిందంటూ ఎల్లో మీడియా సహకారంతో చంద్రబాబునాయుడు దుష్ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు 20 శాతం కూడా అమలు చేయలేకపోయారన్నారు. అయితే జగన్ మోహన్‌రెడ్డి నూటికి నూరుశాతం హామీలను అమలు చేశారన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చంద్రబాబుకి ప్రజల్ని మోసం చేయడంలో ఆరితేరిన వ్యక్తి అని అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కుతారన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు కె రాజారా, సుధామా, శ్రీనివాస్, సునీల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు



ఆకివీడు: చెరుకుమిల్లిలో క్రీడాకారులతో సర్పంచ్ నందమూరి ప్రకాశం



ఆకివీడు: చినకాపవరంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



ఉండి: చెరుకువాడలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో కబడ్డీ ఆడుతున్న మహిళలు



కాళ్ల: హైస్కూల్లో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



వీరవాసరం: రాయకుదురులో ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



భీమవరం అర్బన్: వెంప గ్రామంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఆకివీడు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామాల్లో రెండవ రోజు బుధవారం పండుగ వాతావరణంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగాయి. మండలంలోని ఏడు సచివాలయాల పరిధిలో, నగర పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలో బ్యాడ్మింటన్ పోటీలు పూర్తయ్యాయని మండల గేమ్స్ కోఆర్డినేటర్ జీ. మోహన్ చెప్పారు. నగర పంచాయతీ పరిధిలో బ్యాడ్మింటన్‌లో 42 టీములు ఆడినట్లు చెప్పారు. క్రికెట్ పోటీలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

కాళ్ల హైస్కూల్లో సందడి

కాళ్ల: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రెండో రోజు బ్యాడ్మింటన్ పోటీలో ఆ గ్రామాల్లో యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మండలంలో ఏలూరుపాడు, కాళ్ల, కలవపూడి, సీసలి, కోపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటల పోటీలు జరుగుతున్నాయి. ఆయా గ్రామల పరిధిలో ఉన్న సచివాలయల్లో నుంచి ఆటలో పాల్గొనేందుకు యువతీ యువకులు ఆసక్తిని చూపుతున్నారు. సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు సమక్షంలో క్రీడలను నిర్వహిస్తున్నారు.

వీరవాసరం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన వీరవాసరం, రాయకుదురు, తోలేరు, కొణితివాడ, మత్స్యపురి, అండలూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో కబడ్డీ పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి రాష్ట్ర ,జాతీయ స్థాయిలో వారిని నిలిపేలా ఉంచడమే ప్రధాన ఉద్దేశంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. క్రీడాకారులకు ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, సర్పంచులు గెద్దం భారతి, చికెలే మంగతాయారు ,బిశెట్టి లక్ష్మి, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, నూకల కనకారావు, వీరవల్లి కనక ఉషారాణి, బోను జోష్ణ దేవి, నాగరాజు పద్మకళ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, రాయలం, చిన అమిరం, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, తోకతిప్ప, నాగిడిపాలెం, దొంగపిండి, లోసరి, అనాకోడేరు, కొమరాడ, తుందుర్రు, వెంప తదితర గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. క్రీడాకారులు ఉత్సాహంగా వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు.

జోరుగా హుషారుగా 'ఆడుదాం ఆంధ్ర'

ఉండి: ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలకు గ్రామాల్లో పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. రెండవ రోజు బుధవారం మండలంలోని 21 సచివాలయాల పరిధిలో ఉండి, చెరుకువాడ, యండగండి, ఎన్నార్పీ అగ్రహారం, ఉప్పులూరు, మహదేవపట్నంలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఆటల పోటీలను ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రారంభించారు. కబడ్డీ, షటిల్, ఖోఖో, క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకువాడలో నిర్వహించిన సమావేశంలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొండవేటి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు చెప్పలేనంత సంతోషాన్ని కలిగిస్తున్నాయన్నారు. గ్రామాల్లో క్రీడాకారులను గుర్తించి వారిలో ప్రతిభను వెతికితీసి ఉన్నతస్థాయికి తీసుకురావాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యోద్దేశ్యమని అన్నారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గ్రామాలు అభివృద్ధి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీవీఎల్ తదితరులు

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో పెదఅమీరం గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు స్పష్టం చేశారు. కాళ్ల మండలం పెద అమీరంలో సుమారు రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం, గ్రామ పంచాయతీ నిధులు రూ.3.75 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి, రూ.4 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లు, సీసీ రహదారులు నిర్మించారన్నారు. దీంతోపాటు గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణానికి సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావుతో పాటు పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పాటు గ్రామల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పశ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, ఉపసర్పంచ్, పార్టీ నాయకులు జవ్వాది సత్యనారాయణ, బిరుదు గద్ద రమేష్, మన్నె నాగరాజు, బాలాజీ, సుబ్బరాజు, కాటిక ఆనంద్ రాజ్, జయకృష్ణ, యాకోబు, పెనుమత్స రంగరాజు, పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పీవీఎల్‌ను కలిసిన అంగన్‌వాడీలు

కాళ్ల: పాలకోడేరు మండలం అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. కాళ్ల మండలం పెదఅమిరంలో వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహరాజు చేతులమీదుగా పాలకోడేరు మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంపికైన టి.అలేస్ మేరీ, సీహెచ్ ధనలక్ష్మికి ఉద్యోగ నియామకపత్రాలు, అంగన్‌వాడీ సహాయకురాలుగా పనిచేస్తున్న జె.పుష్పకు కార్యకర్తగా పదోన్నతి పత్రాలను అందజేశారు.

పట్టణాభివృద్ధిపై సమీక్ష



భీమవరం: మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమవరం: భీమవరం పర్యటనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో భీమవరం పట్టణంలోని మరింత అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం క్యాంపు కార్యాలయంలో మున్సిపాల్టీలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణాన్ని మోడరన్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే అనేక చర్యలు చేపట్టామని, మరింతగా అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మున్సిపల్ ఎంఈ త్రినాథరావు, హౌసింగ్ డీఈ శివరామరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ ఎస్.లోకేశ్వరరావు, డీఈ రామరాజు, పంచాయతీరాజ్ డీఈ జి.స్వామినాయుడు, ఏఈలు శ్రీనివాస్, శశి కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సుందరకుమార్

భీమవరం: పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన గంటా సుందరకుమార్ బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పాడిపరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తూ రైతులకు అండగా నిలుస్తోందని ప్రభుత్వ పథకాలను రైతులకు మరింత చేరువచేసే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లా రాజ్‌కుమార్, గెద్దం జార్జ్. పట్టెం శుభాకర్, జి డానియేల్, అండటి ఆనందకుమార్, కర్రా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణ పథకాలు వద్దని నిరసన



భీమవరంలో ఆటో వర్కర్ల నిరసన

భీమవరం: ఆర్టీసీ బసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ఆటో వర్కర్స్ పొట్టకొట్టవద్దని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ అన్నారు. బుధవారం భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీ ఎస్ఆర్టీసిలో ఉచిత ప్రయాణమంటూ రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో పెట్టడం వల్ల జిల్లాలోని వేలాది మంది ఆటోవర్కర్స్ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోల్లో ఎక్కువగా మహిళలే ప్రయాణిస్తుంటారని ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న ఆటో వర్కర్స్ కుటుంబాల పరిస్థితి దుర్భరంగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పంపన గోపి, లింగం రాంబాబు, వాసు ఆరేపల్లి బాలాజీ, సంజీవరావు, శామ్యూల్ రాజు, సతీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయాలి



శ్రీరామపురంలో సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు

భీమవరం అర్బన్: ప్రజా నాయకుడు, సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29న భీమవరం పట్టణంలోని మెంటేవారితోట వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు కోరారు. భీమవరం మండలంలోని శ్రీరామపురం గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కాండ్రేగుల నరసింహరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాయకత్వంలో నియోజకవర్గం ఇప్పటివరకు ఎవరూ చేయని విధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు 3 చోట్ల అండర్ టన్నెల్స్, 100 పడకల ఆస్పత్రి, అర్హులైన పేదలందరికీ ఇళ్లు, గ్రామాలలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు చేపట్టి ప్రజా వినియోగంలోకి తీసుకురావడమే కాకుండా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాల జీవితాలను మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు వేలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నామన మహేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు, ఉప సర్పంచ్‌లు కలిదిండి ఫణిరాజు, తిరుమల విజయరామ్, కలిదిండి చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

దోషాలు లేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయండి



ఉండిలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు

ఉండి: అధికారులు ఎంతో కష్టపడి తయారు చేస్తున్న ఓటరు జాబితాపై ఎవరూ ఆరోపణలు చేయలేనంత పటిష్టంగా సిద్ధం చేయాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. ఓటరు జాబితా తయారీ, నమోదు వంటి పలు అంశాలపై ఉండి లయన్స్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో ఎటువంటి తప్పులు దొర్లకుండా తయారు చేయాలని అన్నారు. ప్రతి కాలేజీ, హైస్కూల్ స్థాయిలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ (ఈఎల్‌సీ)ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కృష్ణారావు, షేక్ హుస్సేన్, డీటీ ఎస్వీఎస్ నాయుడు, సూపర్‌వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



దిరుసుమర్రులో శ్రీ భక్తాంజనేయ స్వామి

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి వారి 44వ హనుమద్ వ్రత మహోత్సవంలో భాగంగా బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి పంచామృత, సహస్రనామార్చన, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు. అనంతరం సుమారు 4 వేల మందికి అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆఖరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను గవర శ్రీరాజబాబు, నక్కా వెంకట సత్యనారాయణ, అల్లూరి బంగార్రాజు, మైగాపుల గంగారామ్, యర్రంశెట్టి అంజిబాబు, యాళ్ల బాబు పర్యవేక్షించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సదస్సులు

ఉండి: మండలంలోని పెదపుల్లేరు, అర్తమూరు గ్రామాల్లో బుధవారం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ అవగాహన సదస్సులు బుధవారం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న పథకాలు, దేశంలో మోదీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ రాష్ట్ర నాయకుడు రవివర్మ తదితర నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు నాయకులు,అధికారులు పాల్గొన్నారు.